సాక్షి
ఆదిలాబాద్

శుక్రవారం । 17 । జనవరి । 2025



నాగోబా జాతరకు ఏర్పాట్లు

ఈ నెల 28న మెస్రం వంశీయుల మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం కానుంది. భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో ▸



ఆ దేవుడే కాపాడిండు! 8లో ▸

కాశీ యాత్రకు వెళ్లి ప్రమాదానికి గురైన యాత్రికులు భైంసాకు చేరుకున్నారు. 'ఆ దేవుడే కాపాడిండు' అంటూ సంఘటనను గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

గరిష్టం/కనిష్టం
28.0/14.0

వాతావరణం

కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి పెరుగుతుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

విధుల్లో చేరిన డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: అనారోగ్యంతో గతనెల 6 నుంచి సెలవులో ఉన్న డీఈవో ప్రణీత గురువారం విధుల్లో చేరారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఈవోగా కార్యాలయ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి వ్యవహరించిన విషయం తెలిసిందే.

సర్వే పక్కాగా చేపట్టాలి



సర్వేను పరిశీలిస్తున్న శ్యామలాదేవి

ఇచ్చోడ: రైతు భరోసా సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ఆదేశించారు. గురువారం మండలంలోని జున్ని, అడేగామ(కే) గ్రామాల్లో చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించారు. సాగుకు యోగ్యమైన భూములను గుర్తించాలని సూచించారు. లే అవుట్‌లు, నాన్‌అగ్రికల్చరల్ కింద మార్పు చేసిన భూములనూ గుర్తించాలని ఆదేశించారు. ఆమె వెంట ఏడీఏ రాంకిషన్, ఏవో జాదవ్ కైలాస్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: 2025–26 విద్యాసంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలు, 6నుంచి 9వ తరగతుల్లోని ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. http@/tgcet.cgg.gov.in లో ఫిబ్రవరి 1వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తు ప్రక్రియలో సందేహాలున్నా, సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులను పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించాలని అధికారులు సూచించారు.

గంగాజాతర ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలం డొల్లార సమీపంలోని పెన్‌గంగానది తీరాన గంగాజాతర గురువారం ప్రారంభమైంది. జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. గంగానదిలో స్నానాలాచరించారు. గంగానదికి హారతి ఇచ్చారు. స్వామి రామానంద్, మదన్‌రావు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

'డయల్ యువర్ డీఎం' కార్యక్రమానికి స్పందన

ఆదిలాబాద్: ఆర్టీసీ ఆదిలాబాద్ డిపో పరిధిలో గురువారం నిర్వహించిన 'డయల్ యువర్ డీఎం'కు స్పందన లభించింది. డిపో మేనేజర్ కల్పన ప్రయాణికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, ఫిర్యాదులు, సమస్యలు నమోదు చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆదిలాబాద్ నుంచి శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్–బెంగళూరు మధ్య బస్సు నడపాలని కోరారు. నిర్మల్ నుంచి భారత్‌నాయక్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్–కరీంనగర్ బస్సును కడెం మీదుగా నడపాలని విజ్ఞప్తి చేశారు. బోథ్ నుంచి సురేశ్, ఆదిలాబాద్ నుంచి వినోద్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్–నాగపూర్ మధ్య 1, 6 గంటలకు బస్సు నడపాలని కోరారు. వీటిపై డీఎం సానుకూలంగా స్పందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ మ్యాథ్స్ ఫోరం (టీఎంఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో ప్రణీత ఆవిష్కరించారు. టీఎంఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ దిలీప్‌రెడ్డి, కిషన్ తదితరులున్నారు.

20న ప్రధానమంత్రి జాతీయ శిక్షణ మేళా

కైలాస్‌నగర్: జిల్లాలోని ఐటీఐ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో శిక్షణ, స్వయం ఉపాధి కల్పించేందుకు ఈ నెల 20న ఉట్నూర్ గిరిజన ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రధాన మంత్రి జాతీయ శిక్షణ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీసీ ఫుడ్ డివిజన్ (హైదరాబాద్), ఎల్‌జీ హోప్ (హైదరాబాద్), ఎల్‌అండ్‌టీ (పుణే) లాంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ పేరును గూగుల్ లింక్ ద్వారా ముందుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఐటీఐ పాస్ సర్టిఫికెట్, ఎస్సెస్సీ మెమో, ఆధార్‌కార్డ్, అప్రెంటీస్ రిజిస్ట్రేషన్ జిరాక్స్ కాపీతో ఉట్నూర్‌లోని ఐటీఐ కళాశాలలో జరిగే మేళాకు హాజరుకావాలని సూచించారు.



ఫీల్డ్ వెరిఫికేషన్‌లో భాగంగా సిరికొండ మండలం పొన్న గ్రామంలో గురువారం కలెక్టర్ రాజర్షిషా పర్యటించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు సంబంధించి సూపర్‌చెక్ ప్రక్రియను పరిశీలించారు. సర్వే తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.



జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ కాలనీలో జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వర్లు పర్యటించారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆయన కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లారు. వారి వివరాలు సేకరించారు.



భీంపూర్ మండలం నిపాని గ్రామంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బీ కిషన్ పర్యటించారు. ఈ గ్రామంలో సాగులో లేని భూమిని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేయించారు.

సర్వే సందడి!

- 26నుంచి పలు పథకాల అమలు
- కొనసాగుతున్న అర్హుల ఎంపిక
- క్షేత్ర స్థాయిలో సూక్ష్మ పరిశీలన
- ప్రక్రియలో అధికారులు, సిబ్బంది
- నిత్యం ఫీల్డ్ విజిట్‌లో కలెక్టర్



జిల్లా కేంద్రంలోని అనుకుంటకాలనీలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

సాక్షి, ఆదిలాబాద్: ఈ నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొన్ని పథకాల అమలుకు సిద్ధమవుతోంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలులోకి తెచ్చి అర్హులకు ప్రయోజనం చేకూర్చేందుకు చర్యలు చేపడుతోంది. ఇందుకు ప్రస్తుతం అధికారులు, ఉద్యోగులు సర్వేలో బిజీగా ఉన్నారు. గురువారం నుంచి ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించారు. ఈనెల 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హుల జాబితాను రూపొందిస్తారు. 21 నుంచి గ్రామసభల్లో ఆ జాబితాను ప్రవేశపెట్టి ఆమోదం తీసుకుంటారు. ఆ తర్వాత జాబితాలను కలెక్టర్ కార్యాలయంలో అందిస్తారు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటనలో పలు శాఖల అధికారులు, ఉద్యోగులు బిజీబిజీగా ఉన్నారు. సర్వే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న పథకాల్లో ప్రధానంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసాతో పాటు భూమి లేని కూలీలకు ఆర్థికసాయం అందించేందుకు సర్వే మొదలైంది. కలెక్టర్ మొత్తం ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిశీలిస్తున్నారు.

అమలయ్యే పథకాలివే..

రైతు భరోసా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా అర్హుల జాబితా తయారు చేయడంలో నిమగ్నమైంది. సాగుకు యోగ్యం కాని భూములు, గుట్టలు, నివాసాలు కలిగిన ఇతర భూములు, వెంచర్లు, భూ సేకరణ కింద తీసుకున్న సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కాలువలు, రైల్వే లైన్, రహదారుల కోసం తీసుకున్న భూముల వివరాలు అధికారులు సేకరిస్తున్నారు. వ్యవసాయ అధికారులు రూపొందించిన జాబితాను క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించాలి. రేషన్ కార్డు కోసం వచ్చిన దరఖాస్తుదారుల పూర్తి వివరాలు నమోదు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారి వార్షికాదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారికి రూ.2లక్షలకు మించి ఉండకూడదు. రేషన్ కార్డుల్లో పేర్ల తొలగింపు, కొత్త పేర్లు చేర్చడం లాంటి ప్రక్రియ కూడా చేపట్టాలి. ఇందిరమ్మ ఇళ్ల సర్వే జిల్లాలో దాదాపు పూర్తయింది. అర్హుల జాబితా తయారు చేశారు. క్షేత్రస్థాయిలో మరోసారి ఆ జాబితాపై సమగ్ర పరిశీలన ప్రస్తుతం సూపర్‌చెక్ విధానంలో సాగుతోంది. భూమిలేని నిరుపేదలు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కనీసం 20 రోజుల పాటు పనిదినాలు కలిగి ఉండాలి. వీరి వివరాలతో అర్హుల జాబితాను రూపొందించాలి. ఉపాధిహామీ కూలీల జాబ్‌కార్డుకు ఆధార్‌కార్డును అనుసంధానించాలి. ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయింది. ఆ తర్వాత భూ భారతి పోర్టల్‌తో మ్యాచింగ్ చేసి భూమిలేని వారి వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత సంవత్సరానికి వారికి రూ.12వేల ఆర్థికసాయం ప్రభుత్వం అందించనుంది. ఇందుకు అధికారులు అర్హుల జాబితాను రూపొందించే పనిలో పడ్డారు. మొత్తంగా ప్రస్తుతం అధికారులు, ఉద్యోగులు క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు వార్డు సభలు, గ్రామసభల ద్వారా అర్హుల జాబితా రూపొందించే పనిలో ఉన్నారు. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు, రెవెన్యూ సిబ్బందితో బృందాలను నియమించారు. ప్రస్తుతం గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో పర్యటించి సర్వే చేస్తున్నారు. మొత్తంగా జిల్లా అంతటా సర్వే సందడి కనిపిస్తోంది.

పకడ్బందీగా చేపడుతున్నాం



క్షేత్రస్థాయి పరిశీలన పకడ్బందీగా చేపడుతున్నాం. సమగ్ర పరిశీలన అనంతరం గ్రామసభల ద్వారా అర్హుల జాబితా రూపొందిస్తాం. అర్హులందరికీ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూస్తాం. ఈనెల 21నుంచి గ్రామసభల్లో అర్హుల జాబితా ప్రవేశపెట్టి ఆమోదం తీసుకుంటాం.

– రాజర్షిషా, కలెక్టర్

ట్రాఫిక్ కష్టాలు తీరేదెలా?



అంబేడ్కర్‌చౌక్‌లో రోడ్డుపై నిలిపిన వాహనాలు

- ఎక్కడబడితే అక్కడే పార్కింగ్
- ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాలు
- అవస్థలు పడుతున్న జనాలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. వాహనాల సంఖ్య పెరిగి రోడ్లన్నీ రద్దీగా మారాయి. కొందరు వాహనాలను ఎక్కడబడితే పార్కింగ్ చేస్తుండటంతో ఈ సమస్య తలెత్తుతోంది. అశోక్ రోడ్, గాంధీచౌక్, అంబేడ్కర్‌చౌక్, శివాజీచౌక్, రైతుబజార్, కలెక్టర్ చౌక్, బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటోంది. పలువురు రాంగ్‌రూట్‌లో వాహనాలతో వెళ్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు మధ్యలోని డివైడర్‌కు ఇరువైపులా చిరువ్యాపారులు బండ్లు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నారు. దీంతో రోడ్డుపై ద్విచక్రవాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. పంజాబ్‌చౌక్ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. రాంనగర్ ప్రాంతంలో ఇసుక ట్రాక్టర్లు, అశోక్ రోడ్, అంబేడ్కర్‌చౌక్, గాంధీ చౌక్ ప్రాంతాల్లో షాపుల ఎదుట వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

రోడ్డు పక్కన వ్యాపారాలు

జిల్లా కేంద్రంలో కొందరు ప్రధాన రోడ్లకు ఇరువైపులా వ్యాపారం చేస్తున్నారు. దీంతో రోడ్డు పక్కన నిలపాల్సిన వాహనాలు మధ్యలో నిలుపాల్సి వస్తోంది. ఈ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాన్వెంట్ పాఠశాల, బస్టాండ్ ప్రాంతంలోని స్కూళ్ల ఎదుట, వినాయక్ చౌక్‌లోని పాఠశాలల వద్ద నిత్యం ఈ సమస్య తలెత్తుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో అంబేడ్కర్ చౌక్ నుంచి గాంధీచౌక్, అశోక్ రోడ్ నుంచి బంగారు దుకాణాలకు వెళ్లే తిర్పెల్లి రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. రోడ్డు ఇరుకుగా ఉండడంతో రెండు వాహనాలు దాటలేని పరిస్థితి ఉంది. దుకాణాల ఎదుటే వాహనదారులు పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా కలెక్టర్ చౌక్, అంబేడ్కర్‌చౌక్, గాంధీచౌక్, శివాజీ చౌక్, మున్సిపల్, తాంసి బస్టాండ్, సాత్నాల బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వ్యాపారులు రోడ్లపైకి వచ్చి వ్యాపారం కొనసాగిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. తోపుడు బండ్లు తొలగించాలని పోలీసులు సూచిస్తే వారితోనే వాగ్వాదానికి దిగుతున్నారు. రైతుబజార్ ఎదుట సాయంత్రం 4నుంచి రాత్రి 8గంటల వరకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ స్థలంలో కొందరు చిరువ్యాపారులు విక్రయాలు కొనసాగిస్తుండగా ఈ ప్రాంతం రద్దీగా మారి వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులేర్పడుతున్నాయి. వ్యాపారుల కోసం రైతుబజార్‌లో ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేసినా పార్కింగ్ స్థలంలోనే విక్రయాలు కొనసాగిస్తున్నారు.

జరిమానాలతోనే సరి పెడుతూ..

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధిస్తున్నా ట్రాఫిక్‌ను నియంత్రించడంలేదనే ఆరోపణలున్నాయి. రోడ్ల పక్కన, పార్కింగ్ స్థలం, ప్రధాన కూడళ్లలో చిరువ్యాపారులు విక్రయాలు కొనసాగిస్తున్నా నియంత్రించేవారే లేరని వాపోతున్నారు. రాంగ్ రూట్, ట్రిపుల్ రైడింగ్ చేసే వాహనదారులపై చర్యలు తీసుకోవడంలేదని విమర్శిస్తున్నారు. భారీ శబ్దాలతో ద్విచక్ర వాహనదారులు వెళ్తున్నా పట్టింపులేదని ఆరోపిస్తున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..



మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. తరచూ నిబంధనలు అతిక్రమిస్తున్న వారిని గుర్తించి వారి వివరాలు రవాణాశాఖ అధికారులకు ఇస్తున్నాం. డ్రంకెన్ డ్రైవ్ చేపట్టి జరిమానా విధిస్తున్నాం. ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. సైలెన్సర్లు లేకుండా భారీ శబ్దాలతో వెళ్లే వాహనాలను సీజ్ చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే.

– ఎల్.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ

లబ్ధిదారుల ఎంపిక పక్కాగా ఉండాలి



రేషన్‌కార్డు దరఖాస్తుదారుడితో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

సిరికొండ: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం అర్హుల ఎంపిక పక్కాగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. గురువారం మండల కేంద్రంలో చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించాలని సూచించారు. మండలంలోని రాయిగూడలో రేషన్ కార్డుల సర్వేలో భాగంగా దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి నేరుగా వివరాలు సేకరించారు. మండలంలోని పొన్న గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సూపర్ చెక్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శ్మశాన వాటిక నిర్మించాలని సిరికొండ గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్, డీఎల్పీవో ఫణిందర్, తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో సంతోష్‌కుమార్, వ్యవసాయశాఖ అధికారి శ్రద్ధారాణి, ఏఈవో ప్రవీణ్, సర్వేయర్ గణేశ్, పంచాయతీ కార్యదర్శులు అరుణ్‌కుమార్, నీతా, అజ్మత్ పాల్గొన్నారు.

సంప్రదాయాలను మరువొద్దు



సభలో మాట్లాడుతున్న బాపూరావు

ఇచ్చోడ: ఆదివాసీ యువత సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోవద్దని మాజీ ఎంపీ సోయం బాపూరావు సూచించారు. గురువారం నారాయణ్‌పూర్‌లో నిర్వహించిన గోండి ధర్మ సభలో పాల్గొని మాట్లాడారు. ఏటా పవిత్ర పుష్యమాసంలో ప్రతి ఒక్కరూ 'జై జంగో'.. జై లింగో' దీక్షలు స్వీకరించాలన్నారు. పట్టుదలతో చదువుకుని కుటుంబాలను ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలని, మూఢ నమ్మకాలను వీడాలని, ఆరోగ్య సమస్యలుంటే ఆస్పత్రులకే వెళ్లాలని సూచించారు. దీక్ష గురువు భగవంత్ మహారాజ్ మాట్లాడుతూ.. ఆదివాసీ యువత మద్యం, మాంసాహారాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. వ్యసనాలకు బానిసైనవారు చిన్న వయస్సులోనే మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఆదివాసీ పెద్దలు కుంర కోటేశ్వర్, జలై జాకు, కొడప నగేశ్, వివిధ గ్రామాల పటేల్‌లు, సార్‌మేడిలు, జంగో లింగో దీక్షాపరులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

తాంసి: భీంపూర్ మండలం నిపాని శ్రీభూగోదా సహిత వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం చివరిరోజు వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు పద్మావతి, లక్ష్మీదేవి, వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ వ్యవస్థాపకుడు శివదత్తగిరి మహారాజ్, పండితులు నేరెళ్ల కళ్యాణాచార్యులు, ఉమాకాంత్ కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో రాగా, ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్, జిల్లా నాయకుడు పాయల్ శరత్ తదితరులు బ్రహ్మోత్సవాలకు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. సామాజిక కార్యకర్త బండారి దేవన్న, కొండయ్య చౌదరి తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశా రు. భక్తులకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కూలీలకు 'ఆత్మీయ భరోసా'

- రూ.12వేలు అందించనున్న సర్కార్
- 'ఆధార్' అనుసంధానానికి దూరంగా జిల్లాలో 20వేల మంది కూలీలు
- ప్రక్రియ పూర్తికి అధికారుల కసరత్తు

ఈజీఎస్ అమలయ్యే మండలాలు : 17
జిల్లాలో జాబ్‌కార్డులు : 1,71,505
నమోదు చేసుకున్న కూలీలు : 3,49,368
ఉపాధి పొందుతున్న కూలీలు : 1,55,269

మండలం	కుటుంబాలు	కూలీలు
ఆదిలాబాద్	11,376	23,527
బజార్‌హత్నూర్	7,534	16,261
బేల	11,508	21,874
భీంపూర్	8,414	17,762
బోథ్	15,050	31,189
గాదిగూడ	6,655	14,623
గుడిహత్నూర్	9,338	20,679
ఇచ్చోడ	10,696	22,710
ఇంద్రవెల్లి	12,601	25,055
జైనథ్	14,905	28,781
మావల	3,352	5,272
నార్నూర్	9,712	21,251
నేరడిగొండ	8,290	16,865
సిరికొండ	5,848	11,555
తలమడుగు	10,585	21,398
తాంసి	6,067	11,685
ఉట్నూర్	19,574	38,881



జిల్లా కేంద్రంలో ఉపాధి కూలీల ఆధార్ సీడింగ్‌లో నిమగ్నమైన డీఆర్డీఏ అధికారులు

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లో జీవించే భూమిలేని వ్యవసాయ కూలీలకు చేయూతనందించేలా రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాన్ని ప్రకటించింది. ఈ నెల 26నుంచి దీన్ని అమలు చేయాలని భావించి రూ.6వేల చొప్పున రెండు విడతల్లో ఏడాదికి రూ.12వేల ఆర్థికసాయం అందించాలని నిర్ణయించింది. ఉపాధిహామీ జాబ్ కార్డు ఉండి, గత ఆర్థికసంవత్సరంలో కనీసం 20 రోజుల పనిదినాలు పూర్తి చేసిన వారిని అర్హులుగా ప్రకటించింది. అయితే జిల్లాలో సుమారు 20వేల మంది కూలీల జాబ్‌కార్డులకు సంబంధించి ఆధార్ సీడింగ్ ప్రక్రియ జరగలేదు. అలాంటి వారి వివరాలతో కూడిన జాబితాను ప్రభుత్వం జిల్లాకు పంపించి ఆధార్ సీడింగ్ చేయిస్తోంది.

జిల్లాలో 3,49,368 జాబ్‌కార్డులు

గ్రామీణ ప్రాంతాల్లో వలసలను అరికట్టి కూలీలకు 100రోజుల పాటు వారి గ్రామాల్లోనే పని కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2005లో ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిని ప్రారంభించిన నుంచి ఇప్పటివరకు జిల్లాలో అధికారులు 1,71,505 కుటుంబాలకు చెందిన 3,49,368 మందికి జాబ్‌కార్డులు జారీ చేశారు. ఇందులో 84,805 కుటుంబాలకు సంబంధించి 1,55,269 మంది కూలీలకు పని కల్పించారు. ఇక గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 5,507 కుటుంబాలకు గాను 14,285 మందికి కొత్తగా జాబ్‌కార్డులు జారీ చేశారు. ఏటా కొత్తగా జాబ్‌కార్డులను జారీ చేస్తూ ఆసక్తి కలిగిన కూలీలకు వివిధ పనులు కల్పిస్తున్నారు.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చేలా..

వ్యవసాయ కూలీల గుర్తింపునకు ఉపాధిహామీ జాబ్‌కార్డును కీలకంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా పనిచేసే కూలీలు, జాబ్‌కార్డుల వివరాలు కోరింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు 1,71,505 జాబ్ కార్డులకు సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. వాటిని పరిశీలించిన రాష్ట్రస్థాయి అధికారులు ఇందులో సుమారు 20వేల కూలీల ఆధార్ సీడింగ్ కానట్లు గుర్తించారు. ఈ నెల 26నుంచి పథకం అమల్లోకి వస్తే అర్హులకు నష్టం జరుగుతుందనే ఉద్దేశంతో వారి జాబ్‌కార్డుల ఆధార్ సీడింగ్ చేపట్టాలని ఆదేశిస్తూ గ్రామపంచాయతీల వారీగా కూలీల వివరాలతో కూడిన జాబితాను జిల్లాకు పంపించారు. పొరపాట్లు సవరించి కూలీల జాబ్‌కార్డులకు తప్పనిసరిగా వారి ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ నంబర్‌ను జత చేయాలని ఆదేశించింది.

ప్రక్రియలో నిమగ్నమైన ఉద్యోగులు

ప్రభుత్వం నుంచి అందిన జాబితాను పరిశీలించిన అధికారులు వివిధ కారణాలతో ఆధార్ సీడింగ్ కానట్లు నిర్ధారించారు. మరణించిన, శాశ్వతంగా వలసవెళ్లిన కూలీల పేర్లు తొలగించకపోవడం, ఆధార్‌కార్డు, జాబ్‌కార్డులోని వివరాలు సరిపోలకపోవడం, జెండర్‌లో తప్పుగా నమోదు కావడం లాంటి అంశాలను గుర్తించారు. వాటిని సవరించడంలో డీఆర్‌డీఏ అధికారులు దృష్టి సారించారు. గ్రామాలవారీగా అందించిన వివరాల ప్రకారం ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తమ పరిధిలోని ఇంటింటికి వెళ్లి కూలీల జాబ్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు సేకరిస్తున్నారు. వాటిని తమ మండల పరిధిలోని కంప్యూటర్ ఆపరేటర్లకు అందజేస్తున్నారు. వారు పంపించిన వివరాలను జిల్లా కార్యాలయంలోని ఉద్యోగులు ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో ఆధార్‌సీడింగ్ చేస్తున్నారు. ఇందుకు ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పండుగ, సెలవు రోజులైనప్పటికీ గత శనివారం నుంచి రాత్రీపగలు తేడా లేకుండా ఆధార్‌సీడింగ్‌లో నిమగ్నమయ్యారు. ఇదివరకు జరిగిన పొరపాట్లను సవరించి పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు.

90శాతం సీడింగ్ పూర్తి చేశాం



ప్రభుత్వం అందించిన నివేదిక ప్రకారం సంబంధిత కూలీల వివరాలన్నింటినీ గ్రామాల వారీగా సమగ్రంగా సేకరిస్తున్నాం. పొరపాట్లకు తావివ్వకుండా వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి వారి జాబ్ కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేస్తున్నాం. సెలవు రోజుల్లోనూ రాత్రీపగలు పనిచేస్తూ ఇప్పటివరకు 90శాతం ప్రక్రియ పూర్తి చేశాం. రెండు, మూడు రోజుల్లో వందశాతం పూర్తిచేసి అర్హులందరికీ అన్యాయం జరగకుండా చూస్తాం. భూమి కలిగినవారూ ఉపాధి పనులకు వస్తుంటారు. అలాంటి వారి గుర్తింపు ప్రభుత్వమే రాష్ట్రస్థాయిలో నిర్ణయిస్తుంది.

– రాథోడ్ రవీందర్, డీఆర్డీవో

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు


గాయపడిన తిరుపతిగౌడ్

రామకృష్ణాపూర్ (చెన్నూర్): ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మందమర్రి మండలంలోని తిమ్మాపూర్‌లో చోటు చేసుకుంది. బొక్కలగుట్ట గ్రామానికి చెందిన వేముల తిరుపతిగౌడ్ గురువారం ఉదయం తిమ్మాపూర్‌లో తాటిచెట్టు ఎక్కుతుండగా ఒక్కసారిగా కాలు జారడంతో కిందపడిపోయాడు. దీంతో తీవ్రగాయాలు కావడంతో స్థానికులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఇరువర్గాల దాడిలో 16 మందిపై కేసు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): మండలంలోని హర్కపూర్‌తాండలో ఇరువర్గాల మధ్య జరిగిన దాడిలో 16 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. గ్రామానికి చెందిన ఆడే అవినాష్, ఆడే ప్రమీల భార్యభర్తలు. ఇద్దరి మధ్య కొంతకాలంగా గొడవ జరుగుతుండడంతో ఇటీవల ప్రమీల పుట్టింట్లో ఉంటోంది. ఈ నెల 15న అవినాష్ తన భార్యను తీసుకువచ్చేందుకు వెళ్లగా ఇరు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. మాటామాట పెరగడంతో ఒకరిపై ఒకరు కర్రలు, బండరాళ్లతో దాడికి పాల్పడ్డారు. గురువారం ప్రమీల ఫిర్యాదు మేరకు అవినాష్‌తో పాటు అంకుష్, సునీల్, నితేష్, రామ్‌లాల్, ఆడే రేణుకపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కౌంటర్ పిటిషన్‌గా అవినాష్ పిర్యాదు చేయగా ప్రమీలతో పాటు రాథోడ్ అయిలబాయి, జాదవ్ శ్రీకాంత్, రాథోడ్ రాందాస్, రాథోడ్ ప్రేమ్‌దాస్, జాదవ్ రమేశ్, జాదవ్ సంజు, జాదవ్ విద్యాసాగర్, జాదవ్ ప్రతాప్, రాథోడ్ శేషేరావ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

140 దేశీదారు బాటిళ్లు స్వాధీనం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన దినేష్ దేశీదారు విక్రయిస్తుండగా గురువారం పట్టుకున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. మహారాష్ట్రలోని కిన్వట్ నుంచి దేశీదారు తీసుకొచ్చి జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అతని వద్ద నుంచి 140 దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

19న నాలుగో బర్డ్‌వాక్

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో ఈ నెల 19న బర్డ్‌వాక్ నిర్వహించనున్న ట్లు జన్నారం రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. ఆసక్తి గల వారు తమ పేర్లను 18న రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 19న ఉదయం బర్డ్‌వాక్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు డీఆర్వోను 9441057771 నంబరులో సంప్రదించాలని సూచించారు. ఇప్పటి వరకు డివిజన్‌లో మూడు సార్లు బర్డ్‌వాక్ నిర్వహించగా 50 మంది వరకు బర్డ్ వాచర్లు హాజరయ్యారని తెలిపారు.

ఆ దేవుడే కాపాడిండు..!

- ప్రమాద ఘటన కళ్లముందే తిరుగుతోంది
- భావోద్వేగానికి లోనైన బృందావన్ యాత్రికులు
- తమవారిని చూసి కన్నీటి పర్యంతమైన కుటుంబీకులు


ఓదారుస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్


తమవాళ్లను చూసి కన్నీరు మున్నీరవుతున్న కుటుంబసభ్యులు

భైంసా(ముధోల్): 'అగ్నిప్రమాదం ఇంకా కండ్లల్ల తిరుగుతున్నది. ఆ మంటలకు బతుకుతామను కోలే. ఆ దేవుడే మమ్మల్ని కాపాడిండు' అని బృందావన్ యాత్రికులు కన్నీరు మున్నీరయ్యారు. కాశీ యాత్రకు వెళ్లి ప్రమాదానికి గురైన బృందం గురువారం సాయంత్రం భైంసాకు చేరుకుంది. సాయంత్రం 4:30 గంటలకు ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీకి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి రెండు ట్రావెల్ బస్సులు చేరుకున్నాయి. బస్సులో నుంచి తమ వారు దిగుతుండగానే కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. పది నిమిషాలపాటు ఉద్విగ్న వాతావరణం నెలకొంది. రెండు రోజులుగా నిద్రాహారాలు మాని ఇంటికి ఎప్పుడు చేరుకుంటామా అని ఎదురుచూసిన యాత్రికులు కుటుంబీకులను చూసి ఆగలేకపోయారు. ప్రాణాలతో వచ్చామంటూ తమ రక్తసంబంధీకులను పట్టుకొని రోదించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ వారిని ఓదార్చారు.

బుధవారమే బయలుదేరి...

యాత్రికులు ప్రయాణించిన బస్సు మంగళవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బృందావన్ క్షేత్రంలో దహనమైంది. ఈ ప్రమాదంలో పల్సి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సజీవ దహనమయ్యాడు. యాత్రికుల సామగ్రి పూర్తిగా కాలి బూడిదైంది. బస్సులో ప్రయాణించిన యాత్రికులు కట్టుబట్టలతోనే మిగిలిపోయారు. వీరి పరిస్థితిని గుర్తించిన అక్కడి ప్రాంత పోలీసు, రెవెన్యూ అధికారులు, ఆర్ఎస్ఎస్ శ్రేణులు, వ్యాపార, వర్తక సంఘాలు స్పందించి అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించి అవసరమైన సహాయ సహకారాలు అందించారు. సమాచారం అందుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అక్కడి పోలీసు, రెవెన్యూ అధికారులతో మాట్లాడి తమ ప్రాంతవాసులను సురక్షితంగా భైంసాకు చేర్చాలని కోరారు. రెండు టూరిస్టు బస్సులలో భైంసాకు పంపించారు.

కట్టె సల్లారకముందే ఆర్పేసిన..

- కన్నీటి పర్యంతమైన ఎల్లుబాయి

'కట్టే సల్లారకుండానే ఆర్పిన.. దొర నీన్ను కళ్లారా చూసుకోలేకపోయిన. ఉపాసన కలిసే ఉన్నాం. యాత్రకు పోయి నిన్ను విడిచి వచ్చిన.. నా దొర నిన్ను ఎక్కడ ఎత్కాల... నిన్ను యాడ చూసుకోవాలా... నా కష్టం ఓలకు చెప్పుకోవాలా'.. అంటూ శిల్యం ఎల్లుబాయి రోదించిన తీరు అందరినీ కలిచివేసింది. తన దొర శీల్యం దుర్పతి బస్సులోనే కాలిపోయాడని అందరూ ఉన్న ఒక్కదాన్నే అంత్యక్రియలు నిర్వహించానని చెప్పిన తీరు కలచివేసింది. కాశీ యాత్రలో తమ కుటుంబానికి దేవుడు అన్యాయం చేశాడని విలపించింది. బాధిత కుటుంబీకుల బంధువులు, పల్సి గ్రామస్తులు ఆమెను ఓదార్చారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.


కన్నీటి పర్యంతమవుతున్న ఎల్లుబాయి

జాతరలో మూడుముక్కలాట


జాతరలో పేకాట ఆడుతున్న దృశ్యం

సారంగపూర్(నిర్మల్): ఏటా సంక్రాంతి సందర్భంగా మండలంలోని బండరేవుతండాలో నిర్వహించే నానూమహారాజ్ జాతరలో పేకాట గుట్టు రట్టయ్యింది. జాతరలో పేకాట ఆడుతుండగా గమనించిన స్థానికులు జిల్లా పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల ఆదేశాల మేరకు బుధవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాటతో పాటు మద్యం, ఇతర జూద క్రీడలు సైతం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పోలీసులను గమనించిన జూదరులు పరారయ్యారు. రాంసింగ్‌తండా, పొట్య, కుప్టి తండాలకు చెందిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు జూదానికి తెరతీసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

మూడు బృందాలతో గాలింపు

సంక్రాంతి సందర్భంగా జిల్లాలో పేకాట, జూదం అరికట్టడానికి మూడు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించామని ఎస్పీ జానకీ షర్మిల వెల్లడించారు. తమకు వచ్చిన సమాచారంతో బండరేవుతండాలో దాడులు నిర్వహించగా పేకాట శిబిరాల నిర్వహణ వెలుగులోకి వచ్చిందన్నారు. పేకాట ఆడితే చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.



గుర్రపు డెక్క నిండి.. ఉపాధికి గండి

మత్స్యకారులకు ఉపాధితో పాటు పంట పొలాలకు సాగునీటిని అందించే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ చెరువు పూర్తిగా గుర్రపుడెక్కతో నిండి పంట పొలాన్ని తలపిస్తోంది. గతంలో మున్సిపల్ ఆధ్వర్యంలో రూ.40 లక్షల వ్యయంతో దీన్ని తొలగించే పనులు చేపట్టినప్పటికీ సాధ్యంకాకపోవడంతో మరింత విస్తరించింది. దీంతో చేపల పెంపకానికి అవకాశం లేక మత్స్యకారులు ఉపాధికి దూరం కావాల్సిన దుస్థితి ఏర్పడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పశువుల్లో లింగనిర్ధారణతో ఫలితాలు


మందులు పంపిణీ చేస్తున్న జిల్లా అధికారి

జన్నారం: కొత్త సాంకేతికతలో భాగంగా పశువుల్లో లింగనిర్ధారిత కృత్రిమ గర్భం వల్ల ఆడదూడలు జన్మిస్తాయని, ఈ పద్ధతి ద్వారా మంచి ఫలితాలు సాధించి రైతులకు లబ్ధి చేకూరుతుందని జిల్లా పశువైద్యాధికారి శంకర్, ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి శాఖ అధికారి రామారావు రాథోడ్ అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 26 గేదెజాతి పశువులు, 39 ఆవులకు ఉచిత గర్భకోశవ్యాధి నివారణ, పశువైద్య చికిత్సలు, కృత్రిమ గర్భధారణ పరీక్షలు చేశారు. ఉచిత గర్భధారణ ద్వారా జన్మించిన 19 దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల్లో లింగ నిర్ధారిత కృతిమ గర్భధారణ వల్ల 90 శాతం ఆడదూడలు జన్మిస్తాయని, ఈ ప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు మందులు పంపిణీ చేశారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, పంచా యతీ కార్యదర్శి ఎం.లావణ్య, గోపాలమిత్ర జిల్లా సూపర్‌వైజర్ ఏ.రవి, గోపాలమిత్రలు పాల్గొన్నారు .

మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య


రాజేందర్ (ఫైల్)

కడెం(ఖానాపూర్): మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని మొర్రిగూడెంకు చెందిన సాదు రాజేందర్ (42) కొంతకాలంగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. అతని భార్య అనూష మందలించడంతో మనస్తాపం చెంది ఈ నెల13న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో ఈ నెల 15న బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరు బలవన్మరణం


సాహెబ్‌రావు మృతదేహం

తానూరు(ముధోల్): మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మహాలింగిలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బుఠ్నార్ సాహెబ్‌రావు (43)కొంతకాలంగా మద్యానికి బానిసై ఏపనీ చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఉదయం పంటచేనుకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్నానని కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఫోన్ చేశాడు. చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య సుమిత్రబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


సురేష్ (ఫైల్)

లక్ష్మణచాంద(నిర్మల్): ఈ నెల 13న మద్యం మత్తులో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సుమలత తెలిపారు. మండలంలోని మల్లాపూర్‌కు చెందిన సిలారి సురేష్ (22) ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లి ఐదునెలల క్రితం ఇంటికి తిరిగివచ్చాడు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 13న మద్యం మత్తులో తమ చేనులో పురుగుల మందు తాగాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతుని తల్లి సిలారి ముత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బార్‌లో నకిలీ పోలీస్ హల్‌చల్

మంచిర్యాలక్రైం: పట్టణంలోని ఓ బార్‌లో నకిలీ పోలీస్ హల్‌చల్ చేశాడు. తుపాకీతో బెదిరించి మద్యం సేవించాడు. అనంతరం బిల్లు చెల్లించకుండానే ఉడాయించాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బెల్లంపల్లికి చెందిన పానగంటి రాజు బుధవారం రాత్రి మంచిర్యాలలోని ఓ బార్‌లో మద్యం సేవించేందుకు వెళ్లాడు. తాను పోలీస్‌నంటూ తుపాకీ టేబుల్‌పై పెట్టి మద్యం తెప్పించుకున్నాడు. అనంతరం సర్వర్ బిల్లు అడగడంతో 'పోలీస్‌నే బిల్లు అడుగుతావా' అంటూ తుపాకీతో బెదిరించాడు. బార్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ఫోన్ తీయడంతో బిల్లు చెల్లించకుండానే అక్కడి నుంచి ఉడాయించాడు. బార్ యజమాని ఏపూరి జగన్‌మోహన్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: పేకాట ఆడుతున్న నలుగురిని గురువారం అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బంగారిగూడ శివాలయం సమీపంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,960 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య


భర్త అంత్యక్రియల్లో రాజక్క

నెన్నెల(బెల్లంపల్లి): పేగుబంధం లేకపోవడంతో కట్టుకున్న భర్తకు భార్య తలకొరివి పెట్టిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోణంపేటకు చెందిన పాగిడి సత్తయ్య (45), రాజక్క భార్యాభర్తలు. ఇటీవల సత్తయ్య అనారోగ్యానికి గురికావడంతో గురువారం మృతి చెందాడు. దంపతులకు సంతానం లేకపోవడంతో భర్తకు రాజక్క తలకొరివి పెట్టింది. దయనీయ పరిస్థితి అందరిని కదలించింది.

కుస్తీ వస్తాదులు

- దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం
- రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్న గ్రామీణ మల్లయోధులు


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు (ఫైల్)

తానూరు(ముధోల్): నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలోని సరిహద్దు ప్రాంతాలకు చెందిన మల్లయోధులు కుస్తీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. జిల్లాలో ఎక్కడ కుస్తీ పోటీలు నిర్వహించినా సరిహద్దు ప్రాంతాలైన తానూరు, కుభీర్, ముధోల్, కుంటాల, బాసర మండలాలకు చెందిన మల్లయోధులు పాల్గొని తమ సత్తా చాటుతున్నారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు.

తరతరాలుగా వస్తున్న సంప్రదాయం

మహారాష్ట్రలో కుస్తీ పోటీలకు మక్కువ చూపిస్తారు. జిల్లాకు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో జిల్లావాసులు కూడా మహారాష్ట్ర సంప్రదాయం కొనసాగిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాలైన తానూరు, కుభీర్, కుంటాల, ముధోల్, బాసర, తదితర ప్రాంతాలకు చెందిన యువకులు కుస్తీ పోటీలపై ఆసక్తి కనబరుస్తున్నారు. తండ్రులు, తాతలు, ముత్తాతల నుంచి వచ్చిన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో పండుగలు, ఉత్సవాలు జరిగినా గ్రామ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఉదయం నిద్రలేవగానే యోగాసనాలు వేస్తారు. అనంతరం పాలతో పాటుగా బలమైన అల్పాహారం తీసుకుంటారు. మధ్యాహ్నం భోజనంలో కూరగాయలతో కూడిన చపాతి, జొన్నరొట్టె తీసుకుంటారు. మళ్లీ సాయంత్రం పాలుతాగి యోగాసనాలు వేస్తారు. రాత్రిపూట చపాతి, జొన్నరొట్టె, నెయ్యితో కూడిన భోజనం తీసుకుంటారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం నాటు కోడిగుడ్డు ఆరగిస్తారు. వారానికి రెండుసార్లు మాంసాహారం తప్పనిసరిగా తీసుకుంటారు.

అంతా రైతు కుటుంబీకులే..

కుస్తీ పోటీలపై మక్కువ చూపే మల్లయోధులంతా రైతు కుటుంబాలకు చెందిన వారే. ఇటు వ్యవసాయ పనులు చేస్తూనే సమయం దొరికినప్పుడల్లా కుస్తీ పోటీల్లో పాల్గొంటారు. తానూరు మండలం హిప్నెల్లి గ్రామానికి చెందిన కుస్తీ వస్తాద్ లోనేకర్ బాలాజీ యువకులకు కుస్తీ పోటీల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

ప్రభుత్వం సహకారం అందిస్తే..



ఇటీవల హన్మకొండలో నిర్వహించిన సీఎం కప్ చాంపియన్‌షిప్ రెస్లింగ్ పోటీల్లో 55 కేజీల విభాగంలో పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించా. కుస్తీ పోటీల్లో పోల్గానడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం సహకారం అందిస్తే మరిన్ని పతకాలు సాధిస్తా.

– గంగాప్రసాద్, మల్లయోధుడు, తానూరు

కాంస్య పతకం సాధించా



తానూరు జిల్లా పరిషత్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. ఇటీవల హన్మకొండలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని 45 కేజీల విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించా. లోనేకర్ వస్తాద్ వద్ద శిక్షణ తీసుకుంటున్నా. ఎక్కడ పోటీలు నిర్వహించినా పాల్గొంటున్నా.

– సీహెచ్ బాలాజీ, మల్లయోధుడు, తానూరు

ఆనవాయితీగా వస్తోంది



మా కుటుంబాలకు చెందిన పెద్దల నుంచి కుస్తీ పోటీలను ఆనవాయితీగా కొనసాగిస్తున్నాం. పెద్దల ప్రోత్సాహంతోనే కుస్తీ నేర్చుకున్నాం. తండ్రులు, తాతలు, ముత్తాతల నుంచి ఆనవాయితీగా వస్తోంది. వివిధ గ్రామాలకు చెందిన యువకులకు కుస్తీలో శిక్షణ ఇస్తున్నా.

– లోనేకర్ బాలాజీ, శిక్షకుడు (వస్తాద్), హిప్నెల్లి

నాగోబా జాతర ఏర్పాట్లు ముమ్మరం


మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అధికారులు


రోడ్డుపై గుంతలను పూడుస్తున్న సిబ్బంది

ఇంద్రవెల్లి: పుష్యమాస అమవాస్యను పురస్కరించుకుని ఈ నెల 28న మెస్రం వంశీయుల మహాపూజలతో ప్రారంభం కానున్న కేస్లాపూర్ నాగోబా జాతర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. జాతరకు వచ్చే మెస్రం వంశీయులు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయ పరిసర ప్రాంతంలో చేపట్టిన మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్మాణ పనులు, తాగునీటి ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, పారిశుద్ధ్య నిర్వహణ పనుల కోసం రూ.24 లక్షలతో ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరైతే భక్తులకు ఎలాంటి సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భానుకుమార్‌లున్నారు.

ముమ్మరంగా జాతర ఏర్పాట్లు

ఈ నెల 28న మెస్రం వంశీయుల మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం కానున్నందున అధి కారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ముత్నూర్ నుంచి కేస్లాపూర్ వరకు రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంక్‌లలో క్లోరినేషన్ పనులు ముమ్మరం చేశారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో కోనేరు, గోవడ్‌లకు రంగులు వేయడంతో పాటు భూమి చదును పనులు పూర్తి చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో శాశ్వత మరుగుదొడ్లు, స్నానపు గదులకు మరమ్మతులు చేపడుతున్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదుల ఏర్పాటు పనులు ముమ్మరం చేశారు. జాతర ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేసి మెస్రం వంశీయులు, భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు.

నేడు నాగోబా జాతర నిర్వహణపై వేలం

ఇంద్రవెల్లి(ఖానాపూర్): పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 28న మెస్రం వంశీయుల మహాపూజతో ప్రారంభం కానున్న నాగోబా జాతర నిర్వహణపై నేడు శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఈవో రాజమౌళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్, వాహనాల పార్కింగ్, విద్యుత్ కనెక్షన్, ప్యాలాలు, పుట్నాలు అమ్ముకోవడానికి, కొబ్బరి ముక్కలు పోగుచేసుకునేందుకు ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో పాటు రెవెన్యూ, దేవాదాయశాఖ అధికారులు, మెస్రం వంశీయుల సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యాపారులు తైబజార్‌కు ముందస్తుగా రూ.50వేలు, ఇతర పనుల నిర్వహణకు రూ.20వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

కట్టుకున్నోడినే కడతేర్చింది..

- భర్తకు పురుగుల మందు తాగించిన వైనం
- రెబ్బెన మండలం తక్కళ్లపల్లిలో ఘటన


సతీష్ (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): కష్టసుఖాల్లో భర్తకు తోడుగా నిలవాల్సిన భార్యే తన పాలిట మృత్యువైంది. కాయకష్టం చేసి కుటుంబాన్ని పోషించే ఇంటిపెద్ద తాగి వస్తున్నాడనే కారణంతో గుర్తు తెలియని పురుగుల మందు తాగించి హతమార్చింది. ఎస్సై డి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు రెబ్బెన మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన పుప్పాల సతీష్ (30)కు నంబాలకు చెందిన రజితతో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు కుమారుడు ఉండగా రజిత ప్రస్తుతం గర్భిణి. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే సతీష్ ఇంటికి వచ్చే సమయంలో మద్యం సేవించేవాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. గురువారం ఉదయం సతీష్ మద్యం సేవించి అదే గ్రామంలో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి వెళ్లి పడుకున్నాడు. అక్కడికి వెళ్లిన రజిత ఇంట్లో ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తీసుకువచ్చి సతీష్‌కు తాగించింది. అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో గమనించిన స్థానికులు విషయాన్ని సతీష్ తల్లికి సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుని తల్లి అమృత ఫిర్యాదు మేరకు రజితపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.